# ప్రార్థన మెట్లు

ప్రార్థనమెట్లు అనగా దైవప్రార్థన చేయునప్పుడు ఉపయోగించు క్రమము.

1. "విశ్వాసము లేకుండా దేవునికి ఇష్టుడై యుండుట అసాధ్యము. దేవునియొద్దకు వచ్చువాడు ఆయన ఉన్నాడనియు, తన్ను వెదకువారికి ఫలము దయచేయువాడనియు నమ్మవలెనుగదా" (హెబ్రీ. 11:6).

2. "ఇద్దరు ముగ్గురు నా నామమున ఎక్కడ కూడియుందురో అక్కడ నేను వారిమధ్యన ఉందునని" యేసుప్రభువు చెప్పెను. (మత్తయి 18:20).

3. "నేను మీకు ఏయే సంగతులను ఆజ్ఞాపించితినో, వాటినన్నిటిని గైకొనవలెనని వారికి బోధించుడి. ఇదిగో నేను యుగ సమాప్తి పర్యంతము సదాకాలము మీతోకూడ ఉన్నాను" అని ప్రభువు వినిపించెను. (మత్తయి 28:20).

4. ఒకసారి చేసిన ప్రార్థన మరల చేయక, దానికి బదులు ఎన్ని పర్యాయములైనను స్తుతి చేయవచ్చును. కొందరు ఒక అంశమును గూర్చి ప్రార్థనచేసి, తరువాత స్తుతిచేసి, సంతుష్టిలేనివారై మరల ప్రార్థనలోనికి దిగుదురు ఇది మంచివాడుక కాదు. స్తుతి మాటలు మాత్రమేగాక, స్తుతి పాటలుకూడా అంగీకారమే. నీ హృదయ పూర్వకముగా నీవు ప్రార్థించిన యెడల, ప్రభువు అన్ని మెట్లలో నీకు మంచి తలంపులు పుట్టించును.

5. "నీవు ప్రార్థన చేయునప్పుడు గదిలోనికి వెళ్ళి తలుపువేసి, రహస్యమందున్న నీ తండ్రికి ప్రార్థన చేయుము. అప్పుడు

రహస్యమందు చూచు నీ తండ్రి నీకు ప్రతిఫలమిచ్చును" అని ప్రభువు వచించెను (మత్తయి 6:6).

6. "అడుగుడి మీకియ్యబడును, వెదకుడి మీకు దొరుకును" అని ప్రభువు సెలవిచ్చెను (మత్తయి 7:7).

7. నాయొద్దకు వచ్చువానిని నేనెంత మాత్రమును బయటికి త్రోసివేయను" అని ప్రభువు పలికెను (యోహాను 6:37).

8. "వాగ్దానము చేసినవాడు నమ్మదగినవాడు గనుక మన నిరీక్షణ విషయమై మనమొప్పుకొనినది నిశ్చలముగా పట్టుకొందము" హెబ్రీ. 10:23).

9. "నా నామమునుబట్టి మీరు నన్నేమి అడిగినను నేను చేతును" అని ప్రభువు వక్కాణించెను (యోహాను 14:14).

10. ఆయననుబట్టి మనకు కలిగిన ధైర్యమేదనగా ఆయన చిత్తానుసారముగా మనమేమి అడిగినను, ఆయన మన మనవి ఆలకించుననునదియే. మనమేది అడిగినను, ఆయన మన మనవి ఆలకించునని మన మెరిగినయెడల మనమాయనను వేడుకొనినవి మనకు కలిగినవి ఎరుగుదుము (1యోహాను 5:14-15).

11. ఒక వైద్యుడు మనయొద్దకువచ్చి మన జబ్బుకు, 'ఫలానా వస్తువులు చేర్చి చేసినయెడల మాత్రలు తయారగునని చెప్పెను.' మొదటిసారి అలాగే అతడు చేసి ఇచ్చును. అయితే అతడు లేనప్పుడు మనము చేసికొనుటయెట్లు? గనుక మనముకూడ నేర్చుకొనవలెను. అట్లే విశ్వాసముకూడ ఎవరి మట్టుకువారు నేర్చుకొనవలెను. నిత్యము వైద్యునిచేతనే మాత్రలు కట్టించుకొన్న యెడల నీయంతట నీవు కట్టుట ఎప్పుడు? కష్టకాలమందు విశ్వాసము అభ్యాసము చేసికొనుము.

12. విశ్వాసమువలన రెండు మేళ్ళు:- 1. అన్ని కీడులు పోవును 2. అన్ని మేళ్ళు కలుగును.

13. అవిశ్వాసమువలన రెండు నష్టములు:- 1. కీడు పోను పోదు 2. మేలు రానురాదు.

14. దేవుడు నా ప్రార్థన విన్నాడని నమ్ముట, మురియుట, స్తుతించుట, సంతోషముతో తిరుగుట, అడిగినదానికంటే ఎక్కువ ఇచ్చునని నమ్ముట విశ్వాసమగును.

15. ఏ మతస్థులైననుసరే! ఏ దేశస్థులైనను సరే, ఎంత దుర్జనులైననుసరే, దయ్యముపట్టిన వారైననుసరే, పిచ్చివారైననుసరే, ప్రార్థనమెట్లు క్రమమునననుసరించి బలవంతముగా ప్రార్థన అభ్యసించిన యెడల, తుదకు దైవమతమేదో తెలిసికొని మోక్షభాగ్యము పొందగలరు. మనస్సులో గందరగోళమున్నను సరే, అవిశ్వాసము బలిసియున్నను సరే, ప్రార్థన ఎంతో బాగుగా చేయవలెనని ఉన్నను అది నామకార్థము లోనికి దిగిననుసరే, ప్రార్థన సమయములో వేలకొలది దుష్టబుద్ధులు దండెత్తి వచ్చిననుసరే, ఈ ప్రకారము యావత్తు జరిపినయెడల తుదకు మహా ధన్యులౌదురు. ఇది ఎవరిమట్టుకు వారే చేసికొనవచ్చును.

16. ఇది వారమునకొకసారియైనను వాడుకొనుము.

17. మనోనిదానము ఏ మెట్టుయొద్ద కుదరదో ఆ మెట్టు యొద్ద కొంతసేపు ఆగి మరల ప్రార్థింపవచ్చును.

18. ' దేవా! నా ప్రార్థన నెరవేరకపోయినను నెరవేరినదని, (మార్కు 11:24) ను బట్టి భావించి నమ్ముచున్నాను "నీవు నమ్మ తగిన దేవుడవు' అని చెప్పుట విశ్వాసము.

19. స్తుతిప్రార్థన:- 'నా ప్రార్థన నెరవేరక పోయినను నెరవేరినదని నమ్మినమీదట, నెరవేర్పు నిమిత్తమై నిన్ను స్తుతింతును' ఎందుకనగా నీవు స్తుతింపదగినవాడవు.

20. ఒక నాస్తికుడు మారినకథ:- ఒక నాస్తికునికి ఒక క్రైస్తవ బోధకునికి జరిగిన సంభాషణము.

క్రై: మీరు దేవుడు లేడని చెప్పుచున్నారు. "దేవా! నీవు ఉన్నావా!' అని మీరెప్పుడైనా అడిగినారా?

నా: లేనివానిని అడుగుట ఎట్లు?

క్రై: పర్వాలేదు. మోకరించి ప్రార్థన చేయండి, ఉంటే జవాబిస్తాడు లేకపోతే లేనేలేదు.

"షరా:- ఆయనను పిలువనిదే, ఆయనలేడని మీరనుట గొప్పదోషము కనుక నాతో మోకరించండి. దేవుని అడుగవలసిన రీతి నేర్పింతునని చెప్పి క్రైస్తవుడు నాస్తికుని బలవంతముగా మోకరింపజేసెను.

క్రై: "దేవా! నీవు నాకు ప్రత్యక్షమగుము. దేవా! పాపినైన నన్ను కరుణించుము" అని పలకండి.

నా: నాకు నమ్మకములేనిదే ఎట్లు పలుకను?

క్రై: మీ నమ్మికతో మీకేమియు పనిలేదు. నేను చెప్పినదే చెప్పండి.

నా: "దేవా! పాపినైన నన్ను కరుణించుము."

క్రై: ఆగండని నేను చెప్పేవరకు, ఈ మాటలు చెప్పుచుండండి.

షరా:- ఇట్లు నాస్తికుడు అనేక పర్యాయములు చెప్పిన తర్వాత, 'అయ్యో! నేనెంతపాపిని! దేవా! నీవున్నావని ఇప్పుడు తెలిసినదని' పెద్దకేకవేసెను. చూచినారా! దైవప్రార్థనచేసిన యెడల సత్యము ఎట్లు తెలియగలదో!

1. ప్రార్థనవలన ఏమి పోవును?

జ: పాపములు, వ్యాదులు, ఇబ్బందులు, అన్నివిధములైన కష్టములు మొదలగునవి పోవును. మనకేమి ఉండకూడదో అవన్నియు పోవును.

2. ప్రార్థనవలన ఏమి వచ్చును?

పాపక్షమాపణ, పాపమును జయించుబలము, దైవచిత్తాను సారముగా నడుచుకొనగల సత్ప్రవర్తన, దైవవాక్యములను గ్రహింపగల

జ్ఞాపకశక్తి, దైవవాక్యములను ఇతరులకు బోధింపగల వాకోద్ధోరణి, ఆరోగ్యము, సమృద్ధి, దైవసహవాసభాగ్యము, సర్వకార్య సాఫల్యము, రక్షణగల మరణము, మోక్షనివాసము: ఈ మొదలగునవన్నియు లభించును.

1. మతవిషయములు నచ్చుజెప్పుట మా పని
2. నమ్ముటయు, ప్రార్థించుటయు మీ పని
3. మన ప్రార్థనలు నెరవేర్చుట యేసుప్రభువు పని

దేవుడు నీ ఎదుట ఉన్నాడనియు, ఆయన నీకు ప్రతిఫలము అనుగ్రహించుననియు, ప్రార్థనాదినుండి ప్రార్థనాంతమువరకు నమ్ముచునే యుండవలయును. ఈ దిగువనున్నమెట్లు ప్రార్థన చేసికొనుటకు ఒక క్రమమును బోధింతును.

**1వ మెట్టు: మనోనిదానము**

(చెమటోడ్చి కష్టపడవలెను)

1. చెడ్డ విషయములు మరచిపోవలెను. 2. మంచి విషయములుకూడ మరువవలెను. 3. రాబోవు సంగతులను మరచిపోవలెను. 4. గతకాల విషయములుకూడ మరచిపోవలెను. 5. క్రీస్తుప్రభువును మాత్రమే జ్ఞాపకము తెచ్చుకొనవలెను. 6. విశ్వాసము, స్తుతి.

**మొదటిమెట్టు వివరము:**

స్నేహితుడా! దైవప్రార్థన సరియైనరీతిగా చేయగోరినయెడల మంచి సమయము, స్థలము, వీలు ఈ మూడును చూచుకొనవలెను. బైటపనులేవియూ లేకుండా చేసికొనవలెను. అప్పుడు మనోనిదానము ఆరంభింపవలెను. తలుపువేసికొన్న నీవు నీ గదిలో మోకరించుము. నేత్రములు మూసికొనుము. చెడ్డసంగతులుగాని, మంచి సంగతులు గాని నీ మనస్సులోనికి రానీ యకుము. అవి వచ్చినయెడల నీ ప్రార్థనకు ఆటంకము కలుగును గనుక యేసుప్రభుని మాత్రమే

తలంచుకొనుము. మరిదేనిని తలంచుకొనవద్దు, నీ పాపములు తలంచుకొనవద్దు, నీ కష్టములు తలంచుకొనవద్దు, నీ శరీర బాధలు, ఇబ్బందులు తలంచు కొనవద్దు, క్రీస్తుప్రభువును మాత్రమే తలంచుకొనుము. కొంతసేపు ఈ తలంపుమీదనే యుండుము. ప్రభువు జ్ఞాపకము వచ్చినాడా? ఆయన ఇక్కడున్నాడను తలంపు - కుదిరినదా? ఆయన ఇక్కడున్నాడను నమ్మిక కలిగెనా? ఈ మూడు ప్రశ్నలు వేసికొని, నీయంతట నీవే జవాబు చెప్పుకొనుము. "ఇద్దరు ముగ్గురు నా నామమున ఎక్కడ కూడియుందురో అక్కడ నేను వారిమధ్యన ఉందునని" యేసుప్రభువు చెప్పినారుగదా? (మత్త. 18:2). గనుక ఇక్కడాయన ఉన్నాడని గ్రహింపవలెను. ఆయనలేడు అని అనుకొనవద్దు, ఉన్నాడని వాక్యము చెప్పుచున్నది, లేదని నీవు ఎట్లనుకొనగలవు?

"మరియు మీరు ప్రార్థన చేయునప్పుడు వేషధారులవలె ఉండవద్దు మనుష్యులకు కనబడవలెనని సమాజమందిరములలోను, వీధుల మూలలోను నిలిచి ప్రార్థనచేయుట వారికిష్టము. వారు తమ ఫలము పొందియున్నారని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను. నీవు ప్రార్థన చేయునప్పుడు నీ గదిలోనికివెళ్ళి తలుపువేసి, రహస్యమందున్న నీ తండ్రికి ప్రార్థనచేయుము. అప్పుడు రహస్యమందు చూచు నీ తండ్రి నీకు ప్రతిఫలమిచ్చును (మత్త. 6:5) అని యేసుప్రభువు ఉపదేశించినారుగదా! దీనినిబట్టి చూడగా నీ ప్రార్థన వినుటకు తండ్రి ఎల్లప్పుడు సిద్ధముగానే యున్నాడు గనుక ఆ నీ తండ్రిని తలంచు కొనుము. "అటువలె ఆత్మయు మన బలహీనతనుచూచి సహాయము చేయుచున్నాడు. ఏలయనగా మనము యుక్తముగా ఏలాగు ప్రార్థన చేయవలెనో మనకు తెలియదుగాని, ఉచ్చరింప శక్యముగాని మూల్గులతో, ఆ ఆత్మతానే మన పక్షముగా విజ్ఞాపనము చేయుచున్నాడు" అని (రోమా. 8:26)లో వ్రాయబడియున్నది.

దీనినిబట్టి చూడగా పరిశుద్ధాత్మ మనకు ప్రార్ధన కార్యములో సహాయము చేయునని కనబడుచున్నది. గనుక ఆయనను తలంచుకొనుము. నీవు ప్రార్ధనలో ఉన్నంతసేపు తండ్రి, కుమార, పరిశుద్ధాత్మలను త్రైకదేవుని తలంపు మీదనే యుండుము. అప్పుడు నీ ప్రార్ధన ప్రయత్నము జరుగును, ప్రార్ధనవాలు కుదురును, మరియు నీ ప్రార్ధన సిద్ధించును. మనో నిదానము లేకుండాజేయు ప్రార్ధన నామకార్ధమైన ప్రార్ధనయగును. మరల చెప్పుచున్నాను: నీ ప్రార్ధనాంశము ఏదనగా, దేవునిని మాత్రము తలంచుకొనుము. ఇదే మనోనిదాన కార్యము. నిదానము లేకుండా ఏ పనిచేసినను నెరవేరదని నీకు తెలుసునుగదా! ప్రార్ధనపని మాత్రమెట్లు నెరవేరగలదు? మనోనిదానము కలిగియున్నప్పుడే దైవ సన్నిధి నీకుతట్టును. దేవుడు నీకు స్వప్నములోనైనను, దర్శనములో నైనను, కనబడకపోవచ్చును. అంతమాత్రమున 'ఆయన నీయొద్దలేడు' అని అనుకొనవద్దు. ఆయన ఉన్నాడనియే అనుకొనవలెను. ఇట్లు అనుకొనుటకు నీకాధారమేది? ఆయన వాగ్దానవాక్యమే (మత్త. 18:20). మధ్యమధ్యను మనోనిదానము చెదరిపోవుచున్న యెడల, మనోనిదాన యత్నము మరల ప్రారంభించుము. దీనికి గొప్పశక్తి, గొప్పవరము అవసరములేదు. అట్టిశక్తి, సహజశక్తి, నీలో ఇదివరకే ఉన్నది. దేవుడు నిన్ను కలుగజేసినప్పుడే నీకవసరమైన శక్తులనుకూడ కలుగజేసెను. నాకు మనోనిదానము కుదరదు అని అనవద్దు. ఈ విషయములో ఎవరి సహాయమైన కోరవచ్చును. గాని మనోనిదానము రాదని మానవద్దు. నీవు మానవుడవు గనుక తప్పకుండా మనోనిదానము కుదురును. అది కుదుర్చుకొనవలెను అను ఉద్దేశముతో మోకాళ్ళమీద నున్నావు, దైవసన్నిధిలోనున్నావు అందుచేత కుదురును, ధైర్యము తెచ్చుకొనుము తండ్రి నిన్ను దీవించుగాక.

### విశ్వాసము స్తుతి:

మనోనిదానము కుదిరిన తర్వాత దేవుని స్తుతించుము ఏమని? ఓ దేవా! తండ్రీ, 'ఇంతసేపటికి నాకు మనోనిదానము కుదిరినది' అని ఇట్టిమాటలతో స్తుతింపవలెను. ఇప్పుడే మరొక స్తుతికూడ చేయవచ్చును. ఎట్లనగా దేవా! నీవే నా తండ్రివి, నీవే నా పోషకుడవు, నీవే నా కాపుదలకర్తవు నీవే నా రక్షకుడవు, నీవే నా వైద్యుడవు, నీవే నా సర్వమైయున్నావు. నిన్నే పూజింతును. నిన్నే ధ్యానింతును. నీకు నా కృతజ్ఞతా స్తోత్రములు. మరియొక విధమగు మనోనిదానము గురించికూడా వినుము: నీకు జబ్బు రావలెనని కోరనుగాని నీకు జబ్బువచ్చినయెడల ఎవరిని తలంచెదవు? వైద్యుని తలంచుదువుగదా! నీ తలంపులో బాధ, వైద్యుడు, మందు ఈ మూడు ఉండును. అట్లే నీ తలంపులో దేవుడుకూడ ఉండవలెను. కష్టకాలమున ఆయనవైపు చూడవలెను. ఇది అభ్యాసము చేసికొనవలెను. దీనినే మనోనిదానమందురు. నీకు బహుమానములు వచ్చినప్పుడు ఎవరిని తలంచుకొందువు? బహుమానములు పంపినవారిని తలంచెదవు గదా! దేవుడు నీకెన్ని బహుమానములు ఇచ్చినాడో ఆలోచించుకొనుము. అన్నము, కూర, నీళ్ళు, చెంబులు, బిందెలు, ఇండ్లు ఈ మొదలగునవని దేవుడు నీకిచ్చు బహుమానములు కావా? గనుక ఆయనను తలంచుకొని సంతోషించుము. సౌఖ్యకాలమందు, కష్టకాలమందు, విశ్రాంతికాలమందు ఆయనను తలంచుకొనుటయే మనోనిదానము. ఒక్క ప్రార్థన సమయములో మాత్రమే మనోనిదానము కలిగియుండ వలెనని నేను చెప్పుటలేదు. అన్ని సమయములలో దైవధ్యాన మనోనిదానము కలిగియుండవలెనని చెప్పుచున్నాను. మనోనిదానము లేకుండా ఏపనియు సాగదు. ప్రార్థనలో మనోనిదానము అభ్యసించిన యెడల అది అన్నిటిలోను కుదురును.

**2వ మెట్టు: ఒప్పుదల** (దుఃఖభాష్పముల ధ్వని)

1. నీవు అపరాదము చేసినయెడల నరులయొద్ద నీ పాపములను ఒప్పుకొనవలెను. 2. దేవునియొద్ద నీ పాపములను ఒప్పుకొనవలెను. 3. పదియాజ్ఞలనుబట్టి నీ పాపములను తెలిసికొని ఒప్పుకొనలేవు. 4. జంతువులయెడల కనపర్చిన, నిర్దయా పాపములనొప్పుకొనవలెను. 5. చేయవలసిన విధులు ఏవైతే చేయలేదో, ఆ పాపములు ఒప్పుకొనవలెను. 6. చేయగూడనివి ఏవైతే చేసావో, ఆ పాపములు ఒప్పుకొనవలెను. 7. నీ అయోగ్యత ఒప్పుకొనవలెను. 8. వస్తువులు సరిగా ఉపయోగింపని లోపములు ఒప్పుకొనవలెను. 9. దుష్టస్వప్నముల బలహీనత ఒప్పుకొనవలెను. తప్పుడు దర్శనముల బలహీనత ఒప్పుకొనవలెను. 10. తలంపులోని పాపములను ఒప్పుకొనవలెను. 11. చూపులోని పాపములు ఒప్పుకొనవలెను. 12. వినుటలోని పాపములు ఒప్పుకొనవలెను. 13. ప్రయత్నములోని పాపములను ఒప్పుకొనవలెను. 14. క్రియలోని పాపములను ఒప్పుకొనవలెను. 15. విసుగుదల, కోపము, అసూయ, అవిశ్వాసము, తొందరపడునట్టి బలహీనత, అధైర్యము, పిరికితనము, నిరాశ, సోమరితనము, తిండిబోతుతనము, త్రాగుబోతుతనము, ధనాపేక్ష, పిసినారితనము, పరజన సంపాదనాపేక్ష ఈ మొదలగునవన్నియు దేవునియెదుట ఒప్పుకొనవలెను. 16. విశ్వాసము, స్తుతి.

**2వ మెట్టు వివరము:-** నీవు దేవుని సన్నిధిలో నున్నావు. గనుక; ప్రార్థనాస్తుతులు చేయబోవుచున్నావు గనుక; ఆయన సన్నిధిలో కొంతసేపైనను కనిపెట్టుకొనియుండబోవుచున్నావు గనుక; ఈ మెట్టుమీద నీ పాపముల నొప్పుకొనుట వలన నీ హృదయమును శుద్ధిచేసికొనవలెను. అధికారులయొద్దకు వెళ్ళవలసినపుడు, నీవు స్నానముచేసి శుభ్రమైన బట్టలు ధరించుకొని వెళ్ళుదువుగదా!

పరిశుద్ధుడైన దేవుని సన్నిధికి వెళ్ళునప్పుడు మరింత శుద్ధిగా సిద్ధపడి వెళ్ళవలెనుగదా! శరీరమును, హృదయమును శుద్ధిచేసికొనవలెను. "హృదయశుద్ధిగలవారు ధన్యులు వారు దేవుని చూచెదరని" ప్రభువు చెప్పలేదా? (మత్త. 5:8).

'పరిశుద్ధత లేకుండా ఎవడును ప్రభువును చూడడు' అని పౌలు వ్రాయుచున్నాడు (హెబ్రీ. 12:14) నీలో ఏ దోషమైనను మిగిలియున్న యెడల అది నీ ప్రార్ధనకు ఆటంకముగా ఉండును. ప్రతి పాపమునకు క్షమాపణపొందునట్లు ఒప్పుకొనుము. అప్పుడు నీ ప్రాణము హాయిగా ఉండును. ప్రార్ధన ధారాళముగా వచ్చును. పాపము లొప్పుకొనునప్పుడు నీ మనస్సునిండా దుఃఖముండవలెను. 'ఎన్ని పర్యాయములు తప్పుచేసినను దేవుడు క్షమించును గనుక మరల తప్పుచేసిన పరవాలేదు అని తలంచుచు, పాపములొప్పుకొన్న యెడల దోషివగుదువు. అట్టి తలంపు దేవుని క్షమాపణను లోకువ గట్టుటయగును. ఒప్పుకొను తలంపును, ఇకమీదట తప్పుచేయను అను తలంపును ఒప్పుదల సమయమందె కలిగియుండుము. మరొక సంగతి: పాపమొప్పుకొన్న యెడల, ప్రస్తుతము నీకున్న కష్టము తొలగునను తలంపుతో ఒప్పుకొనుట, నిజమైన ఒప్పుదలకాదు. కష్టము తొలగినను తొలగకపోయినను, పాపము తొలగించుకొనుటకు పాపమొప్పుకొనుము. "పాపక్రియలవలన నాకు హాని తెచ్చుకొంటిని గదా" అను విచారముతోపాటు, దేవుని దుఃఖపెట్టితినిగదా అను విచారము కలిగియుండుట మహాధన్యతయైయున్నది. తమ పాపములను తలంచుకొని ప్రార్థించునప్పుడు, కొందరు నేలమీదపడి దొర్లుదురు. కొందరు శోకమెత్తి ఏడురు. కొందరు మౌనవ్రతము దాల్చి మనోవేదనగలవారై తిరుగుదురు. కొందరు పాపక్షమాపణ నిశ్చయతఎరుగక,

ప్రార్థించినదే మరల, మరల ప్రార్థింతురు. చెప్పుకొన్నవే తిరిగి చెప్పుకొందురు. ఇట్టివారిని ఆక్షేపింపరాదు.

**విశ్వాసము - స్తుతి**

ఓ దేవా! నా పాపములు ఒప్పుకొనగల కృప దయచేసినావు గనుక నీకనేక వందనములు. 'పాపములు క్షమింతునని' నీవాక్యములో తెలియపరచిన సంగతి నిమిత్తమై, నీకు నా కృతజ్ఞతావందనములు. నీవు నన్ను క్షమించినావని నమ్ముచున్నాను, ఆమేన్. కీర్తన. 85:2; యెషయా 43:25; హెబ్రీ. 8:12 ఆనందభాష్పములు కలిగియుండుము.

**3వ మెట్టు: తీర్మానము** (రక్త స్వేదమొల్కు పని)

1. చెడుగు మానెదను. 2. మంచినే చేయుదును. 3. విధులు నెరవేర్తును. 4. కష్టములలో నిన్నే స్తుతింతురు. 5. ప్రార్థన నెరవేర నప్పుడు నిన్నే స్తుతింతును. 6. బైబిలు నేర్చుకొందును. 7. ప్రార్థన, ధ్యానము మానను. 8. సువార్త బోధింతును. 9. చందా వేతును. 10. మనుష్యుల దయయందును, దేవుని దయయందును పెరుగుదును. 11. 'లేనిపోని కోరికలు కోరను' అని ఇట్లు నిశ్చయించుకొనవలెను. 12. విశ్వాసము స్తుతి.

**3వ మెట్టు వివరము:-** ఈ మెట్టుమీద ఒక ప్రార్థన చేసిన బాగుగా నుండును. ఓ దేవా! నేను ఇదివరకు చేసిన తప్పులు ఇకమీదట ఏమియు చేయను. నాకు తెలిసిన తప్పులు చేయను, నాకు తెలిసిన మంచిని అవలంభింతును. చెడుగును విసర్జించుటకును, మంచిని అవలంభించుటకును, నా శక్తికొలది ప్రయత్నము చేసెదను. నేను ముందుకు ఏ పాపములో పడిపోదునో, పడనో నాకు తెలియదు గాని ప్రస్తుతమున్న నా మనోస్థితినిబట్టి పడననుకొనుచున్నాను నీవు సహాయము చేయుదువుకదా! ఒకవేళ శోధనలు జయింపలేనని తెలిసినప్పుడు నీ సహాయము కోరుదును. నా తీర్మానము ముద్రించుము ఆమేన్.

తరచుగా పడిపోవు నరుడు ఎన్ని గొప్పగొప్ప తీర్మానములు, ప్రమాణములు చేసిన ప్రయోజనమేమి? మానవులు ప్రమాణములు నిలుపుకొనగలరా? అని ప్రశ్నింతువేమో! (1) గత కాలమందు పడిన పాపములలో మరల పడుదుననియు, (2) ఇకముందుకు క్రొత్త పాపములో కూడ పడుదుననియు, నీవు ప్రవచింపలేవు గదా! 'ఆ రెండు అనుమానములెందుకు నీకు'? దేవునిమీద భారమువేసి ప్రమాణము చేయుము. ప్రార్థన మెట్లమీద ఉండగా, నిన్నుగురించి నీకు ఆ రెండు అనుమానములు ఉన్నయెడల పడిపోదువు. 'అనుమానమే' ఆ పడుటలోని మొదటి పడుటయైయుండును. పేతురు నీటిమీద బాగుగానే నడిచెనుగాని అలలధాటికి జంకెను గనుక మునిగెను. ఎందుచేత? ఆలాగు మునుగుటకుగల కారణము అనుమానమే గనుక "ఎందుకు సందేహపడితివి"? అని ప్రభువు మందలించిన ప్రశ్నలో కనబడుచున్నది. కావున సందేహపడవద్దు (మత్తయి 14:31). 'నేను సందేహపడలేదు గాని పడిపోతిని, ఎందుచేత?' అని రేపు నన్ను అడుగుదువేమో? ఆలాగు అడుగక, మోకాళ్ళూని క్షమాపణ నిమిత్తమైన ప్రార్థనచేసి, మరల నడక ప్రారంభించుము. పేతురు పడిపోవుచుండగా చేసిన ప్రార్థన అయిన తర్వాత పేతురు నీటిమీద నడక ప్రారంభింప లేదా? ప్రారంభించినారు. కదా! ఎందుకు సందేహపడితిని? ఎందుకు మునగపోతిని? ఎందుకు అలలుచూచి బెదిరితిని? అని ఇట్టి ప్రశ్నల మీద పేతురు ఉన్నయెడల ఏమగును? ఇట్టి ప్రశ్నల సందడిలో ఉన్న పక్షమున నీ పని ఏమగునో చూడుము! పుట్టగతులే యుండవు గనుక పడినను, లెమ్ము నడువుము. నిన్ను రక్షించు ప్రభువు నీదరినే ఉన్నాడు. పడబోవుచున్న పేతురు చెంత ప్రభువులేదా? గనుక 'పడను' అను 'నీ తీర్మానము మాత్రము దిట్టముగా నుండవలెను. "తాను నిలుచుచున్నానని

తలంచుకొనువాడు. పడకుండునట్లు జాగ్రత్తగా చూచుకొనవలెను. సాధారణముగా మనుష్యులకు కలుగు శోధన తప్పమరియేదియు మీకు సంభవింపలేదు. దేవుడు నమ్మతగినవాడు: మీరు సహింప గలిగినంతకంటే ఎక్కువగా ఆయన మిమ్మును శోధింపబడనియ్యడు. అంతేకాదు, సహింపగలుగుటకు ఆయన శోధనతోగూడ తప్పించుకొను మార్గమును కలుగజేయును" (1కొరింథి. 10:12,13). "తన భక్తుల పాదములు తొట్రిల్లకుండా ఆయన వారిని కాపాడును" (1సమూ. 2:9). నీతిమంతుడు ఏడుమారులు పడినను తిరిగి లేచును" (సామె. 24:16).

**విశ్వాసము స్తుతి:**

ఓ దేవా! నేనింత తీర్మానము చేసికొనగల కృప దయచేసినావు గనుక నీకు వందనార్పణలు. నేను పడకుండా నన్ను కాపాడుదువని నీవు వ్రాయించిన వ్రాతల నిమిత్తమై, నీకు కృతజ్ఞతా నమస్కారములు చెల్లించుచున్నాను.

**4వ మెట్టు - సమర్పణ**

(స్వంత ఇష్టముయొక్క శక్తులు ఉడిగిపోవు పని)

1. దేవా! నీ చిత్తమే. 2. నా చిత్తముగాదు 3. నా ఆత్మను, నా మనస్సును, నా శరీరమును, నా కలిమిని, నా లోపములను నా కోరికలను, నా సేవను ఈ మొదలగు వాటినన్నిటిని నీకర్పించుచున్నాను అని ఇట్లు చెప్పవలెను.

**4వ మెట్టు వివరము:-** ప్రభువు మనకు ఇచ్చినవి ఆయనకే ఇచ్చివేయవలెను? అప్పుడవి శుద్ధియగును. వాటిని మనము సద్వినియోగపరుపవలెను. ప్రతి ప్రార్థనకు చివర నీ చిత్తము సిద్ధించును గాక! అని చెప్పవలెను. యేసుప్రభువు సైతము "నీ చిత్తము" అని ప్రార్థించెను (మత్తయి 26:39-42). నీ చిత్తము అని ప్రార్థించిన తర్వాత దైవచిత్త ప్రకారము చేయునియెడ, నీ సమర్పణకు

Bible Mission HQ Guntur

విలువయుండదు. నీకు దైవచిత్తమెట్లు తెలియును? దీనికి రెండు జవాబులు:

1. ఏది మంచిదో అది దేవుని చిత్తమే. 2. దేవుని గ్రంథములోని బోధ యావత్తు దేవుని చిత్తమే. మిత్రుడా! నీవు నీ చిత్తమును విసర్జించి, దేవుని చిత్తమునే ఆచరింప బూనుకొన్నయెడల, నీకు ఆయన చిత్తము తెలియకుండ నుండునని అనుకొందువా! దేవుడు తన చిత్తమును నెరవేర్చువారికి దాని తెలుపకపోయిన మరి ఎవరికి తెలుపును? కొందరికి దర్శనవరము గలదు. అట్టివారు 'ఈ పని చేయనా, వద్దా?' అని ప్రార్ధనలో ప్రశ్నించునప్పుడు, దేవుడు తన ఇష్టమును స్పష్టముగా తెలియచేయును. వారి సంగతి అట్లుంచుము. దైవగ్రంథములోని బోధ ప్రకారము చేయుము. నీకిష్టమున్నను లేకున్నను దైవచిత్తమునే సాగించుము. ఇదే సమర్పణ ఫలితము. నీ చిత్తము అని పలుకుట నేర్పినానని చెప్పి "దేవా! నీ చిత్తమైతే నా పాపములు క్షమించుము" అని అనవచ్చునా? అనకూడదు. ఎందుచేత? పాపములు క్షమించుట దేవుని చిత్తమని మనకు బాగుగా తెలుసును గనుక. నీ అంశమును గురించి నిష్కపటమైన హృదయముతో ప్రార్థించుము. అప్పుడు దేవుడు ఏదోయొక రీతిగా తన చిత్తమును బైలుపరచును. గాని ఆ చిత్తమును నెరవేర్చనియెడల, రెండవమారు దైవచిత్తము నీకు వెల్లడియగునని తలంపరాదు. దైవచిత్తాను సారమైన రీతిగా నీకొక బాహ్య అనర్ధము సంభవించిన యెడల. 'నీ చిత్తము ప్రభువా!' అని అనుట నేర్చుకొనుము. 'దేవుడు' మిమ్మునెందుకు గ్రుడ్డివారినిగా కలుగజేసినాడు అని ఒక పాఠశాలలో పరీక్షాధికారి పిల్లలను అడుగగా, ఒక బాలిక "అవును తండ్రీ! ఈలాగు చేయుట నీ దృష్టికి అనుకూల మాయెను అని బల్లమీద వ్రాసెను (మత్త. 11:26), నీ కష్టకాలమందు నీవు అట్లనగలిగితే, నీవు సమర్పణ ప్రార్థనకు యోగ్యుడవే.

నీకు కలిగియున్న ఆస్తి దేవునివలన గలిగినదే గనుక దానిని భద్రముగా వాడుకొనవలెను. అశుభ్రముగా నుంచరాదు, పోగొట్టరాదు, దొంగల వశము చేయరాదు. నిర్లక్ష్యముగా చూడరాదు, అల్పముగా ఎంచరాదు. దానిని గౌరవముగా నెంచుటయు. ఇది నా తండ్రి ఇచ్చినది అని ఆనందించుటయు దైవచిత్తమైయున్నది. నీ సామానులు పాడగుట నీ అజాగ్రత్తవలన అయినప్పుడు క్షమించుమని ప్రార్థించుము.

**విశ్వాసము స్తుతి:** ఓ తండ్రీ! నేను ఈ సమర్పణ చేయగల ఇష్టమును కలిగించి నందుకు నీకు కృతజ్ఞతార్పణములు. ఈ సమర్పణను అనుసరించి నడుచుకొనునట్లు నాకు సమర్ధత అనుగ్రహింతువని నమ్మి, నిన్ను స్తుతించుచున్నాను. ఆమేన్.

**5వ మెట్టు - అంశప్రార్థన** (సర్వలోక సంచార మనోకార్యము)

1. ఇక్కడ నీ ఇష్టము వచ్చిన సంగతి గురించి ప్రార్థించు కొనవచ్చును. 2. "నా నామమునుబట్టి మీరు నన్ను ఏమి అడిగినను జేతును" (యోహాను 14:14); విసుగక నిత్యము ప్రార్థన చేయవలెను (లూకా 18:1) అని ప్రభువు చెప్పెను. 3. ఎంత చిన్న సంగతి గురించియైనను ప్రార్థింపవచ్చును. వెనుకతీయవద్దు.

**5వ మెట్టు వివరము:-** మనము ప్రార్థింపవలసిన అంశములు అనేకములు గలవు గనుక దినమునకు కొన్ని అంశములెత్తి ప్రార్థింపవచ్చును. అందలి కొన్ని ముఖ్యాంశములు ఇందు పొందుపరచు చున్నాము:- 1) పాప క్షమాపణ, 2) పాపవిసర్జనాశక్తి, 3) భక్తి జీవనము, 4) బైబిలు జ్ఞానము, 5) ప్రార్థనావాలు, 6) కష్టనివారణ, 7) శరీరారోగ్యము, 8) ఏది కావలెనో అది, 99 మోక్షభాగ్యము - ఇవన్నియు నిన్ను గురించియే.

1) సంఘవ్యాపకము, 2) ఇతర మతములకు సందేశము, 3) బీదలకు పోషణ, 4) రోగులకు స్వస్థత, 5) పాపులకు మారుమనస్సు, 6) శత్రువులకు క్షమాపణ, మార్పు; 7) లోకములోని

ప్రతి సత్కార్యవృద్ధి, 8) అధికారులకు న్యాయస్వభావము, కార్యసిద్ధి; 9) పాఠశాలల వృద్ధి 10) బైబిలు సొసైటీపని, 11) ట్రాక్టుసైటీ పని (పత్రికల పని), 12) అన్ని వృత్తుల వారిని, వారి వృత్తుల నెరవేర్పు, 13) ప్రయాణీకుల క్షేమము ఇవి ఇతరులను గురించి;

నీ వీలోకము విడిచి పెట్టకముందే సర్వాంశములమీద ప్రార్ధనలు ముగింపవలెను. నీవెరిగిన ప్రతివారిని గురించియు, నీవు విన్న ప్రతివారిని గురించియు, నీకు తెలిసిన అంశములన్నింటిని గురించియు ప్రార్ధనలు పూర్తిచేయుము. "మనము సంపూర్ణ భక్తియు, మాన్యతయు కలిగి నెమ్మదిగాను, సుఖముగాను, బ్రతుకు నిమిత్తము అన్నిటికంటే ముఖ్యముగా మనుష్యులందరి కొరకును, రాజుల కొరకును, అధికారుల కొరకును విజ్ఞాపనములును, ప్రార్ధనలును, యాచనలును, కృతజ్ఞతా స్తుతులను చేయవలెనని హెచ్చరించు ." (1తిమో. 2:1-2).

**విశ్వాసము, స్తుతి:-** ఓ దేవా! ఏయే అంశములమీద నేను ప్రార్థింపవలెనో నాకు నేర్పించినావు గనుక నీకనేక వందనములు, నా ప్రార్ధనలన్నియు ఆలకించినావని నమ్ముచున్నాను. నేను ప్రార్ధనలోనికి వచ్చినప్పుడెల్లను, దేనిని గురించి ప్రార్ధన చేయవలెనో జ్ఞాపకము చేయుదువని నమ్ముచున్నాను. లోకములోని విశ్వాసులందరికి, వారు ప్రార్థింపవలసిన యుక్తాంశములు జ్ఞాపకము చేయుదువని నమ్ముచున్నాను. నీకు ఇష్టములేని అంశముమీద ప్రార్ధన చేయబోవుచుండగా, అది ఆపుచేయుదువని నమ్ముచున్నాను, నీకనేక స్తోత్రములు.

**6వ మెట్టు - దైవలక్షణములు:** (కృతజ్ఞతా వందనము)

1) దైవవ్యక్తి, 2) జీవము, 3) ప్రేమ, 4) న్యాయము, 5)శక్తి, 6) జ్ఞానము, 7) పరిశుద్ధత, 8) స్వతంత్రత, 9) సర్వ వ్యాపకత్వము, 10) త్రైకస్థితి 11) లక్షణదానము (దూతలకు, నరులకు).

షరా:- ఇవన్నియు అనాది లక్షణములును, అనంత లక్షణములునైయున్నవి. గనుక వీటిని పూర్తిగా నెవరును వివరింపజాలరు).

**6వ మెట్టు వివరము:-** దైవలక్షణములిందులో వ్రాసియున్నవి మాత్రమే కాదు, ఇంకను అనేకములు గలవు. ఈ ముఖ్య లక్షణములు ఉదహరించి, తండ్రిని స్తుతించుటవలన ఆత్మానందమును, దైవసహవాసమును వృద్ధియగును. దేవుడిట్టి శుభలక్షణముల దేవుడని తెలిసినవారు ఆయనమీద విసుగుకొనరు. ఆయన పనులను అనగా ఆయన దివ్యలక్షణములు చేయు పనులను అపార్ధము చేసికొనరు గాని, దేవుని లక్షణములను, ఆయన పనులను తలంచుకొని ఆనందింతురు. దేవుడిట్టి లక్షణములు గలవాడని సృష్టినిబట్టి తెలిసికొనవచ్చును. దైవగ్రంథమందు ఇవి ఉదహరించబడినవి. దేవుడు నరుని కలుగజేసినప్పుడు తన లక్షణములు పెట్టి కలుగజేసెను గనుక దేవునికి నరుడెంత కృతజ్ఞుడైయుండవలెను? నరునిలో ఇప్పుడున్న దుర్గుణములు దేవుడు కలుగజేసినవికావు. నరుడు దేవుడిచ్చిన శుభ లక్షణములను వాడనందువలన ఇవి వచ్చినవి. "దేవుడెవనిని శోధింపడు గనుక ఎవడైనను శోధింపబడినప్పుడు- నేను దేవునిచేత శోధింప బడుచున్నానని అనకూడదు. ప్రతివాడును తన స్వకీయమైన దురాశచేత ఈడ్వబడి, మరులు కొల్పబడినవాడై శోధింపబడును. దురాశ గర్భము ధరించి పాపమును కనగా, పాపము పరిపక్వమై మరణమును కనును." (యాకోబు 1:15-15).

(శోధించుట అనగా పాపముచేయుటకు ప్రేరేపించుట)

మనలో దైవలక్షణములును, దుర్గుణములును మిళితమైయున్నవి గనుక దైవలక్షణ ధ్యానమువలన దుర్గుణ పరిహారము గావించుకొనవలెను. దైవప్రార్థన ఈ పనికి మిగుల సహాయకారి.

(సంభాషణ కనుకూలముగా నుండునట్లు, దేవుడు ప్రేమగల వాడనియందుముగాని దేవుడు ప్రేమయైయున్నాడనుట సరియైన లేఖనోక్తి. 1యోహాను 4:8).

**1. దైవవ్యక్తి:-** దేవుడు దేవుడైయుండు లక్షణము దేవుడు అనగా దివ్యమైనవాడు గనుక అన్నిటికన్న మొదటివాడు, గొప్పవాడు, మంచివాడు, నిత్యముండువాడు. దేవుడు నిరాకారుడైనను ఒకవ్యక్తియై యున్నాడు.

**విశ్వాసము, స్తుతి:-** దేవా! నీవు దేవుడవు గనుక మా ఊహకు అందునట్టి అన్నింటికంటెను గొప్పవాడవు. నీకనేక నమస్కారములు. నీ ఉన్నావను తలంపు నీవే కలిగించినావు గనుక స్తోత్రములు.

**2. జీవము:-** దేవుడు జీవము గనుక ఏమియు పని చేయకుండా ఉండలేడు. నరుడు పాపములో పడిపోయినయెడల, అతనిని రక్షింపనైన రక్షించును గాని మొదలే అతనిని సృజింపకుండా ఉండలేడు. జీవము అనునది తక్కిన లక్షణములలో కూడ ఉన్నది. అట్లే అన్ని లక్షణములు, అన్ని లక్షణములలో ఇమిడియున్నవి. అన్నియు, ఒకదానికొకటి సంబంధించియున్నవి. ఒకపని చేయవలసినప్పుడు అన్ని లక్షణములు ఒక్కలక్షణముగా పనిచేయును.

**ఉదాహరణ:-** దేవుడొక మొక్కను మొలిపింపదలంచినప్పుడు దానిలో జీవము పోయును. ఈ మొక్క మన ఉపయోగార్థమై మొలచును గనుక ఆయన మనమీదనున్న ప్రేమచేతనే ఈ మొక్కను మొలిపించుట. ఒక కొమ్మ ఎండిపోయినందున దానిని గాలి వచ్చి దులిపివేయును లేదా దానంతట అదే పడిపోవును. ఇట్లు జరుగుట న్యాయమే. ఈ మొక్క కొన్నాళ్ళకు వృక్షమై చాలాకాలము నిలిచి యుండును. ఇది దైవశక్తివలన జరుగును. ఆ చెట్టునకు మొదట పువ్వులు, తరువాత పిందెలు, ఆ తరువాత కాయలు, అటు తరువాత పండ్లు కాయును.

ఈ క్రమము దేవుని జ్ఞానమువలన వచ్చినది. మొక్కను చూడుము. ఎంత పరిశుద్ధముగానుండునో! ఆకులు, కాయలు, పండ్లు, గింజలు ఎంత పరిశుద్ధముగా నుండునో, పరీక్షించుము. దేవుడు పరిశుద్ధుడు గనుక ఆయన కలుగజేసినదంతయు పరిశుద్ధమైనదే. ఈ విధముగా ప్రకృతిలోని ప్రతి వస్తువులోను దైవలక్షణములు గలవని నిరూపించవచ్చును. తక్కిన లక్షణములను గురించి నీవు స్వయముగా ఆలోచించుకొనవచ్చును. మొక్కమీద ధూళిపడి అపరిశుభ్రమగును. ఇది సృష్టిలోనిది కాదు. చీడ పురుగు బయలుదేరి మొక్కను తినివేయును. ఇదికూడ సృష్టిలోనిది కాదు. పైనుండి వచ్చి మొక్కను చెడగొట్టునవి సృష్టికార్యములా? కావుగదా! ఆది నరుడు సృజింపబడినపుడు దేవునివలె పరిశుద్ధుడే గాని మొక్కకు వెలుపలనుండి వచ్చిన ధూళితగిలినట్లు, అతనికి పాపము తగిలినందున అపరిశు ద్ధుడాయెను అయినను తోటమాలివచ్చి మొక్కను శుద్ధిచేయురీతిగానే, సృష్టికర్తవచ్చి ఆది నరుని పాప పరిహారము మూలముగా పరిశు ద్ధునిగాజేసెను. నరుడు, అనగా తానుచేసిన నరుడు చెడిపోతే దేవుడు ఊరుకొనునా? ఆయన పరిశుద్ధత ఊరుకొనునా? ప్రేమగల జీవముబీ జీవముగల ప్రేమ; న్యాయముగల శక్తి; శక్తిగల న్యాయము; జ్ఞానముగల పరిశుద్ధత; పరిశుద్ధతగల జ్ఞానము ఊరుకొనునా? ఆహా! దైవలక్షణములెంత అద్భుతకరమైనవి! ఎంత మెచ్చుకొనదగినవి! ఈ ఆనంద కాంతిలో జీవించుము.

**విశ్వాసము, స్తుతి:-** దేవా! నీవు జీవమై నాలో అనుదినము జీవము కలిగించువాడవై యున్నావు. గనుక నీకు స్తోత్రము. నీవు నాలో ధారపోసిన జీవమునకు శక్తి తగ్గినప్పుడు, నా జీవమును బలపరచువాడవైయున్నావు గనుక నీకు స్తోత్రము. నరులకు జీవము పూర్తిగా పోయి మరణము కలుగును గాని కొన్ని ఏండ్లకు నీవు బ్రతికింతువు. గనుక నీకనేక స్తోత్రములు. శరీర జీవమునకు మాత్రమే

గాక, ఆత్మ జీవమునకు గూడ నీవే ఆధారమైయున్నావు. నేను ఆత్మ జీవన విషయములో తగ్గినప్పుడు, నాలో మరల నూతన జీవము ధారపోయుదువు గనుక నీకు స్తోత్రములు. నాకు పరలోకములో నిత్య జీవము కలిగియుండుటకు, నాలో దానిని ఇక్కడే ప్రారంభించినావు గనుక నీకనేక స్తోత్రములు. నీవు అనంత కాలము పొడుగున జీవించు చునేయుండు రీతిగా, నేనును నీతో జీవించుచునే యుండగల కృప నాకు దయచేసినావు గనుక నీకనేక స్తోత్రములు.

**3. ప్రేమ:-** దేవుడు ప్రేమయైయున్నాడు గనుక మనమెన్ని తప్పులు చేసినను క్షమించుచున్నాడు మనము పుట్టకముందే మనకు కావలసినవన్నియు దయచేసియున్నాడు. అన్నియు మనకు ఇచ్చివేయుటయే ఆయన ప్రేమయొక్క లక్షణమైయున్నది.

**విశ్వాసము, స్తుతి:-** దేవా! నీవు ప్రేమాస్వరూపివై యున్నందుకు నీకనేక వందనములు. ఓ తండ్రీ! నీవు ప్రేమవు గనుక నన్ను కలుగజేయకుండ ఉండలేకపోయినావు. నీ సన్నిధి భాగ్యము నేను నిత్యము అనుభవింపవలెనని కోరి నన్ను సృజించినావు. గనుక నీకనేక వందనములు. నామీద నీకున్న ప్రేమనుబట్టి నేను జన్మింపక ముందే, నాకు కావలసినవన్నియు కలుగజేసియుంచినావు నీకు నాయందు అధికమైన ప్రేమ గనుక నా రక్షణార్థమై, భూలోకమునకు నారూపధారివిగా ప్రత్యక్షమైనావు గనుక నీకనేక వందనములు. ఈ సందర్భమున "దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను" అని చదువుకొని ఆనందించుచున్నాను. నీవు ప్రేమగలవాడవని బాగుగా గ్రహించునట్లు, మనుష్యులలో మనుష్యులకు, జీవరాసులలో జీవరాసులకు ప్రేమ కలిగించినావు. నీ ప్రేమాది సద్గుణములు నీ వాక్యములో బయలుపరచి, నీయాత్మచేత బోధపరచుచున్నావు గనుక నీకనేక వందనములు.

**4. న్యాయము:-** దేవుడు న్యాయవంతుడు గనుక ప్రకృతి ధర్మమునకు భిన్నముగా ఏదియు చేయడు. రెండు అయిదులు పది. 'దీనిని తొమ్మిదిగా మార్చుము' అని అడిగిన యెడల మార్చడు. అట్లు మార్చినయెడల సృష్టి క్రమమునకు విరుద్ధమగును. దేవుడు న్యాయస్థుడు గనుక బహుమానములను, శిక్షలను నరులకు నిర్ణయించుటలో ధర్మానుసారముగానే నిర్ణయించును.

**విశ్వాసము, స్తుతి:-** ఓ దేవా! నీవు న్యాయస్వరూపివై యున్నావు. గనుక నీకనేక స్తుతులు. నీవు న్యాయమైయున్నందున నేరస్థులను శిక్షించుచున్నావు. నీవు న్యాయస్థుడవైయున్నందున ఎంతపాపియైనను ప్రార్థించినపుడు, 'ప్రార్థించినాడు గనుక రక్షించుట న్యాయమే' అని చెప్పి రక్షించుచున్నావు. నీకనేక స్తుతులు. నీవు న్యాయకరుడవు గనుక ఎవరికి ఏ స్థితి అనుగ్రహింపవలెనో ఆ స్థితి అనుగ్రహించుచున్నావు. ఎవరికి ఏవి దయచేయవలెనో అవి దయచేయు చున్నావు. గనుక నీకనేక స్తుతులు. నీవు అన్యాయము చేయజాలవు గనుక నీకనేక స్తుతులు. లోకములో చెడుగు జరుగుటయు, కష్టములు కలుగుటయుచూచి నీవూరుకొనుచున్నావు. ఇది న్యాయమే. ఎందుకనిన, నరులకు స్వతంత్రత ఇచ్చియున్నావు అడ్డము వెళ్ళవు. మరియు పాప శిక్షార్థమై న్యాయపు తీర్పు దినమొకటి ఏర్పరచి యుంచినావు. నరులు నీతట్టు తిరుగగలందులకు కావలసినంత గడువు దయచేయుచున్నావు. ఈ కారణములచేత నీవూరుకొనుచున్నావు. కాబట్టి నీకనేక స్తుతులు. నరులకు జ్ఞానాభివృద్ధియు, మార్పును కల్గించు నిమిత్తమై, కష్టకాలమున ఊరుకొనుచున్నావు గనుక నీకనేక స్తుతులు.

**5. శక్తి:-** దేవుడు శక్తిమంతుడు గనుక సమస్త కార్యములు చేయగలడు ఆయనకు అసాధ్యమైనది ఏదియులేదు. (యిర్మి. 32:27; మత్త. 19:26),

'దేవుడు పాపము చేయగలడా' అని ఒకరు, ఒక క్రైస్తవ బోధకుని అడిగిరి. అందుకాయన చేయలేడని జవాబు చెప్పిరి. అప్పుడా ప్రశ్నకుడు 'అలాగైతే దేవుడు సర్వశక్తిగలవాడని అనకూడదు. అని పల్కెను. అందుకా బోధకుడు ఇట్లు ప్రత్యుత్తరమిచ్చెను. "పాపము చేయుట పరిశుద్ధతనుండి పడిపోవుటయైయున్నది. పడిపోవుట కూడ ఒక శక్తియేనా? ఒకరు పైనుండి పడిపోవుట చూచినప్పుడు అతడు మహాశక్తిగలవాడు గనుకనే పడిపోయినాడు అందురా?

**విశ్వాసము, స్తుతి:–** ఓ దేవా! నీవు శక్తిమంతుడవైయున్నావు. గనుక నిన్ను కొనియాడుచున్నాను. ఓ తండ్రీ! నీవు శక్తిమంతుడవు గాన ఇంత గొప్ప భూమండలమును, అంతగొప్ప ఆకాశమును కలుగజేసినావు గనుక నిన్ను కొనియాడుచున్నాను. ఓ తండ్రి! నా విషయమై నీవు చేయలేని పనియొకటైనా యుండదు. గనుక నిన్ను కొనియాడుచున్నాను నేను చెడిపోయి అధోలోకమునకు వెళ్ళినను, నీవు నన్ను అక్కడనుండి రక్షింపగల శక్తిమంతుడవు గనుక నిన్ను కొనియాడుచున్నాను నేను చేయలేని పనులు నాతో చేయింపగల శక్తిమంతుడవైయున్నావు. గనుక నిన్ను కొనియాడుచున్నాను. నాకు కావలసినవన్నియు తెచ్చిపెట్టగల శక్తిమంతుడవు. నాకు అక్కరలేనివి, నన్ను బాధించునవి పరిహారము చేయగల శక్తిమంతుడవు. నేను మోక్షమునకు ఎగిరిరాలేను. అయినను, నన్నక్కడికి తీసికొని వెళ్ళగల శక్తిమంతుడవు. ఇవన్నియు తలంచుకొని నిన్ను నా మనస్సులో కొనియాడుచున్నాను.

**6. జ్ఞానము:–** దేవుడు జ్ఞాన స్వరూపియైయున్నాడు. అందుచేత ఆయనకు ఆలోచన చెప్పగల వారెవరును లేరు. నవీనకాల మానవులు తమ జ్ఞానమును ఎంత ఎక్కువగా అభివృద్ధి చేసికొన్నారో, నూతన కల్పనలనుబట్టి తెలిసికొనగలము. మానవజ్ఞానమే ఇంతగొప్పదై

యుండగా, మానవులకట్టి జ్ఞానమిచ్చిన దేవుని జ్ఞానమెంత గొప్పదైయుండును? దేవుని జ్ఞానమెంత గొప్పదో తెలిసికొనుటకై, మన అందరి జ్ఞానమంతయు ఉపయోగించినను తెలిసికొనజాలము. వస్తువువంటి వస్తువులేదు. మనిషివంటి మనిషిలేడు. జంతువు వంటి జంతువులేదు. చెట్టువంటి చెట్టులేదు. ఇది అధిక పరీక్షవలన తెలియును. "ఆహా! దేవుని బుద్ధిజ్ఞానముల బాహుళ్యము ఎంతో గంభీరము. ఆయన తీర్పులు శోధింపనెంతో అశక్యములు. ఆయన మార్గములెంతో అగమ్యములు. ప్రభువు మనస్సును ఎరిగినవాడెవడు? ఆయనకు ఆలోచన చెప్పిన వాడెవడు? ముందుగా ఆయనకిచ్చి ప్రతిఫలము పొందగలవాడెవడు? ఆయన మూలమునను, ఆయన ద్వారాను, ఆయన నిమిత్తమును సమస్తము కలిగియున్నవి. యుగయుగముల వరకు ఆయనకు మహిమ కలుగునుగాక! ఆమేన్" (రోమా. 11:33-36).

**విశ్వాసము, స్తుతి:-** ఓ దేవా! నీవు జ్ఞానస్వరూపివి అందుచేత నాకెంతో ఆనందము. నా తెలివి తక్కువవలన నేనేదైనా యొక పని చేయుచున్నప్పుడు, నీ జ్ఞాన దీపముతో నా కొద్దిపాటి జ్ఞానమును వెలిగించి, నాచేత జ్ఞానయుక్తమైన పనులు చేయింతువు గనుక నా కెంతో ఆనందము. నీవు సర్వలోకమును కలుగజేసిన సృష్టి చరిత్ర చూడగా, ఎంతో గొప్పక్రమము కనబడుచున్నది. నరులకు కావలసిన వన్నియు మొట్టమొదట సృజించి, పిమ్మట నరుని చేయుటలో నీ జ్ఞానలక్షణములోని గొప్ప క్రమము కనబడుచున్నది. నీవు మొదట చేయవలసినవి పిదప, పిదప చేయవలసినవి మొదట చేయలేదు. ఎప్పుడు ఏది చేయవలెనో అప్పుడది చేసినావు గనుక నాకెంతో ఆనందము చేసిన వస్తువులను ఎక్కడ ఏవి అమర్చవలెనో అక్కడవి అమర్చినావు. అడవిలో నుండవలసినవి అడవిలోను,

సముద్రములో ఉండవలసినవి, సముద్రములోను ఉంచినావు. వస్తువులను అమర్చుటలో నీ జ్ఞానము కనబడుచున్నది. నీ జ్ఞానకార్యమువల్ల నాకెంతో ఆనందము.

**7. పరిశుద్ధత:–** 'పాపపుణ్యములు దేవుడే కలిగించినాడని' కొందరు దురభిప్రాయపడుచున్నారు. పరిశుద్ధుడైన దేవుడెట్లు పాపము చేయగలడు? ఒకవేళ దేవుడుగాని పాపము చేసినయెడల ఆయన పాపులందరికంటె గొప్ప పాపియగును. పాపియైతే దేవుడెట్లు కాగలడు? వెలుగు చీకటిగాను, వెలుగుగాను ఉండగలదా?

**విశ్వాసము, స్తుతి:–** ఓ తండ్రీ! నీవు పరిశుద్ధుడవు గనుక సమస్తమును పరిశుద్ధముగానే సృజించినావు, నీకు స్తోత్రార్పణములు. పాపినైన నన్ను పరిశుద్ధునిగాజేతువు. తుదకు నన్ను ఈ పాప లోకమునుండి తప్పించి, పరిశుద్ధ స్థానమగు మోక్షలోకమునకు చేర్చెదవు గనుక నీకు స్తోత్రార్పణలు. పరిశుద్ధుడవైన తండ్రీ! నీవు పరిశుద్ధుడవు గనుక పాపమును అసహ్యించుకొందువు. అయినను పాపిని కనికరింతువు గనుక నీకు స్తోత్రార్పణలు. కడవరి తీర్పు అయిన తరువాత నీవు ఈ పాపలోకమును పరిశుద్ధ లోకముగా మార్చి, మోక్ష లోకములో నొక భాగముగా జేర్చెదవు గనుక అనేక స్తోత్రార్పణలు. ఆ తర్వాత భూలోకములో శేషించియుండు వారు పాపమెరుగని వారైయుందురు. అందుచేతను నేడు మోక్షములో నున్నవారు పాపమెరుగని వారైయుందురు. అందుచేతను నీకు నిత్యస్తోత్రార్పణలు. పరిశుద్ధుడా! పరిశుద్ధుడా! పరిశుద్ధుడా! త్రికాలములందు, సర్వస్థలములందు, రక్షితులందరియందు నీవే స్తోత్రార్పణకు పాత్రుడవు.

నీవు పరిశుద్ధుడవు గనుక పాపమును కలుగజేయలేదు. నీకు స్తోత్రార్పణలు. పాపమునకైనను, పాప ఫలితమునకైనను

సృష్టికర్తవు కానట్టి తండ్రీ! పరిశుద్ధతకు మాత్రమే సృష్టికర్తవైయున్న తండ్రీ! నీకు నిత్యానంద స్తోత్రార్పణలు.

**8. స్వతంత్రత:-** దేవుడు సర్వస్వతంత్రుడు గనుక ఆయన ఒకరి ఇష్టమును అనుసరింప నక్కరలేదు. ఒకరిమీద ఆనుకొని యుండవలసిన అగత్యములేదు. ఆయనకుపైగా ఎవరునులేరు. గనుక ఆయన ఒకరికి లోబడవలసిన పనిలేదు. ఆయన తన ఇష్టానుసారముగా సర్వకార్యములు చేయునప్పుడు అడ్డము అనునది యుండదు.

**విశ్వాసము, స్తుతి:-** ఓ తండ్రీ! నీవు సృష్టిలో స్వాతంత్ర్యము దయచేసినందుకు నాకెంతో మనసానందము. నేను నిన్ను బలవంతముగా ఆరాధింపక, నా ఇష్టానుసారముగా ఆరాధింపగలందులకై స్వాతంత్ర్యము అనుగ్రహించినావు గనుక నీకు నా మనసానంద వందనములు. ఆది తల్లిదండ్రులకు నీవు స్వాతంత్ర్యమిచ్చి, తోటలోని పండ్లు నిరభ్యంతరముగా తినవచ్చునని సెలవిచ్చినావు. మేమును ఇట్టి సెలవుగలవారమే. సృష్టిలోనున్న సమస్తమును మేము నిరభ్యంతరముగా అనుభవింపవచ్చును. ఇట్టి కృప నిమిత్తమై నీకు నా మనసానంద వందనములు. ఆత్మీయ జీవములో విశ్వాసులకు సమస్త భాగ్యములు అమర్చి పెట్టియుంచినావు. 'అదిలేదు, ఇదిలేదు' అనక సమస్తమును నేను అనుభవింపవలెనని నీవు కోరుచున్నావు గనుక నీకు నా మనసానంద వందనములు. 'సమస్తమును మీవి. పౌలైనను, అపోల్లోయైనను, కేఫాయైనను, లోకమైనను, జీవమైనను, మరణమైనను, ప్రస్తుతమందైనవియైనను, రాబోవునవియైనను, సమస్తమును మీవే. మీరు క్రీస్తువారు, క్రీస్తు దేవునివాడు" అని పౌలుచేత వ్రాయించిన మాటలు చదివి ఆనందించు చున్నాను (1కొరింథీ. 3:21-23) గనుక నీకు నా మనసానంద వందనములు.

**9. సర్వవ్యాపకత్వము:-** దేవుడు సర్వవ్యాపియైయున్నాడు. ఆయనలేని చోటులేదు గనుక నీవు ఎక్కడేమి చేసినను ఆయనకు తెలుసును గనుక జాగ్రత్తగా మసలుకొనుము. నీవాయనకు దాగియుండలేవు. నీవంగీకరించినయెడల సర్వవ్యాపియైన ఆయన నీకు అన్ని స్థలములలో సహాయము చేయును. క్రీస్తుప్రభువు శిష్యులు ప్రార్థన గృహమందు సమావేశమై దైవాత్మ రావలెనని ప్రార్థించుచుండగా, ఆయన వారిలో ప్రవేశించినప్పుడు యొక ధ్వని కల్గెననియు, అదివారు కూర్చుండియున్న గృహమంతయు వ్యాపించి యుండెననియు వ్రాయబడియున్నది (కార్య. 2:1-4) దైవాత్మ వారి గృహమందును, వారి హృదయమందును, వారి యావజ్జీవమునందును వ్యాపించెను. నీవంగీకరించినయెడల నీ హృదయమంతయు ఆయన వ్యాపించి యుండును. ఇది నీకు మహానందకరమైనవార్త కదా!

**విశ్వాసము, స్తుతి:-** ఓ తండ్రీ! నీవు సర్వవ్యాప్తివై యున్నందుకు నీకనేక స్తోత్రములు. నేను ఇంటిలో నున్నను, బయట నున్నను, స్థలాంతరములో నున్నను, దేవాలయమున నున్నను, పాఠశాల యందున్నను, వృత్తిశాలయందున్నను, నీవు నాయొద్దనే ఉండగలవు. నేను సౌఖ్య స్థలములోనున్నను అపాయకరమైన స్థలములోనున్నను నీవు నాయొద్ద ఉండగలవు. గనుక నీకు నా వందన స్తోత్రములు. నేను ఈ లోకములో ఉన్నను పరలోకమునకు వచ్చినను, నీవు నా దగ్గరనే ఉండగలవు. నేను నిద్రమీద నున్నను, అజాగ్రత్తగా నున్నను, చీకటిలో నున్నను, వెలుతురులో నున్నను నీవు నా చెంతనే యుందువు గనుక నీకనేక స్తోత్రములు. అనంత లోకములో అనంతుడవైన నీవు అనంతకాలము నాయొద్దనే యుందువనియు, నేను నీయొద్దనే యుందుననియు తలంచుకొని ఇప్పుడే ఆనందించుచున్నాను. ఇట్టి జీవభాగ్యము నాకు కలుగును గనుక నీకు నా వందన స్తోత్రములు.

నాతోపాటు పరిశుద్ధులును, దేవదూతలను నీ సన్నిధిలో ఉందురు. ఈ తలంపు నాకానందముగానున్నది నీకు నా వందన స్తోత్రములు.

**10. త్రైక స్థితి:-** దేవుడొక్కడేయైనను మనకు తండ్రిగాను, కుమారుడుగాను, పరిశుద్ధాత్మగాను వాక్యగ్రంథమునకు ప్రత్యక్షమైనాడు. దేవుని గురించి మాట్లాడునప్పుడు ఒక్కడు ముగ్గురుగాను, ముగ్గురు ఒక్కరుగాను ఉన్నట్లు మాట్లాడుదుము. అయినను దేవుడొక్కడే. ముగ్గురు దేవుండ్లు లేరు. ఆయన ముగ్గురుగా బయల్పడినాడని చెప్పి ముగ్గురు దేవుండ్లని అన్నయెడల, ఆ మూడు అను అంకె దైవవ్యక్తి విషయమై సరిపోదు. తండ్రి సర్వలోకమును కలుగజేసెను. కుమారుడు సర్వలోక పాపభారమెత్తుకొనెను, పరిశుద్ధాత్మ సంగతులు వివరించును. జ్ఞానోదయము కలిగించును, శక్తి దయచేయును. ఈ త్రైకమర్మమునకు అందనిది గనుక దీనిని గురించి దీర్ఘాలోచన చేయుట మానవలెను. అయినను మనకు బయలుపడిన దానితో సంతుష్టిపడి, ఆత్మానందము కలిగించుకొనుట మంచిది. జ్వాల, కాంతి, వేడిమి ఈ మూడును కలిసి దీపమైనది. వీటిలో ఒకటి తీసివేసినా, తక్కిన రెండును అంతరించును. వీటిని మూడు వస్తువులని చెప్పము. గాని వస్తువు ఒక్కటే అని చెప్పుదుము. దీనినిబట్టి త్రిత్వమొక్కటని గ్రహింపగలము.

**విశ్వాసము, స్తుతి:-** ఓ తండ్రీ! నీవు తండ్రివిగాను, కుమారుడవు గాను, పరిశుద్ధాత్మగాను, బైలుపడిన మహత్తును, ఒక్కడవైన నీవు ముగ్గురుగాను, ముగ్గురవైన నీవు ఒక్కడవుగాను ప్రత్యక్షమైన మహత్తును స్మరించి, నీకు ఆత్మానంద స్తోత్రములు ఆచరించుచున్నాను. తండ్రీ! నీవు త్రిత్వమైయున్నట్టు మేమును త్రిత్వమై యుండుటకై మాకు ఆత్మను, జీవమును, శరీరమును దయచేసినావు గనుక నీకు నా ఆత్మానంద స్తోత్రములు.

**11. లక్షణదానము:-** దేవుడు నరులను తన స్వరూపమందు సృజించెనని వ్రాయబడియున్నది. (ఆది. 1:26,27; 5:1). ఆయన స్వరూపమనగానేమి? ఆయన లక్షణములే ఆయన స్వరూపము, దేవుడు తన లక్షణములు పెట్టి నరునిచేసెను. (తండ్రి లక్షణములు కుమారునికి కలుగుచున్నవి కదా!) మనము దేవుని ఎరుగక ముందే, మనకాయన తన లక్షణములను దానముచేసెను. దీనిలో దేవుని ప్రేమ కనబడుచున్నది. ఆయన సృజించినవి గూడ మనకు దానము చేసెను. దీనిలో దేవుని ప్రేమ కనబడుచున్నది. ఇందునుబట్టి ఆయన ప్రేమను తెలిసికొనుచున్నాము. ఆయన సృజించిన సృష్టి యావత్తు, కలుగజేసినది యావత్తు మనకే కాబట్టి, మనము మన హృదయములను, కృతజ్ఞతతో నింపుకొన వలయును.

**విశ్వాసము, స్తుతి:-** ఓ దేవా! నీ దివ్యలక్షణములను మాకు దానముగా నిచ్చిన నీ అత్యధిక కృపకు నీకనేకమైన ఆత్మానంద స్తోత్రములు. నీ పావన లక్షణములకు భిన్నమైన చెడు లక్షణములు మాలో ప్రవేశించినందున నీకును మాకును చాల విచారమే. అయినను నీ దానములకు అపకీర్తి కలుగకుండునట్లును, మేము విచారముచేత నశింపకుండునట్లును, మా దుర్గుణములను పరిహరించినట్టి నీ కుమారుని అమూల్య రక్త పద్ధతి నేర్పరచిన నీ జ్ఞాన లక్షణార్థమై నీకు నా ఆత్మానంద స్తోత్రములు. నీవు మాకు అనుగ్రహించిన భూదానముల కంటెను నీ నీ లక్షణమే గొప్పది. ఇది తెలిసికొనుటకై ఇచ్చిన వాక్యదానము. మా హస్తములందున్న గొప్పదానమై యున్నది. అన్ని దానముల నిమిత్తము నీకు నా యాత్మానంద స్తోత్రములు, ఆమేన్

**7వ మెట్టు - కనిపెట్టుట:-** (మునిపని) 1. అన్ని మెట్లమీద దేవునితో మాట్లాడిన నీవు, ఈ మెట్టుమీద నీతో దేవుని మాట్లాడనీయవలెను. 2. నీవు మునివలె నిశ్శబ్దముగా ఉండవలెను.

నీ ప్రార్ధనా స్తుతులు, పాటలు, చదువులు, ఆలోచనలు, కట్టివేయవలెను. సమూయేలు చెప్పినట్లు, "దేవా! నీవేమి చెప్పుదువో నేను విందునని" చెప్పవలెను. 1సమూ. 3:1-10. 3. నీవు ఈ మెట్టుమీద ఉన్నప్పుడు తండ్రి నీ మనుస్సులో మంచి తలంపులు పుట్టించును లేదా నీకు దర్శనమిచ్చి చెప్పవలసినవి చెప్పును. నీ కఠినమైన ప్రశ్నలన్నిటికి ఇక్కడే జవాబు దొరుకును. 4. ఒకవేళ నీకు ఏమియు తెలియబడక పోయినను 'ఇంతసేపు దేవుని సన్నిధిలో నుండగల భాగ్యము దొరికినది, అంతేచాలునని ఆనందింపవలెను. 5. అన్ని మెట్లమీది సంగతులు ఈ మెట్టుమీద పరిష్కారమగును.

**7వ మెట్టు వివరము:-** ఒక అధికారియొద్దకు మనవి చేసికొనుటకై వెళ్ళినవారు, ఆ అధికారి ఏదో ఒకమాట చెప్పక ముందే వచ్చివేయుదురా? దేవుని సన్నిధిలోనికివెళ్ళి మనవిజేసుకొన్న నీవు ఆయన ఏమియు చెప్పకముందే 'ఆమెన్' అన్న వెంటనే వచ్చివేయుట ధర్మమా? ఈ మెట్టుమీద నుండగా వచ్చు తలంపులు నీవు వ్రాసికొన వచ్చును. ఇది చదువు నీవు ఏ మతస్థుడవైననుసరే, ఎంత దుర్జనుడవైనను సరే, ప్రార్థన రాకపోయిననుసరే, బలవంతముగా దినమునకొక గంటయైనను మోకాళ్ళమీద ఉండుము. అప్పుడు నీకు కలుగు మార్పు నాకు చెప్పకుండ ఉండలేవు. సృష్టికర్తకు మహిమ కలుగునుగాక! ఆమేన్.

**విశ్వాసము, స్తుతి:-** ఓ తండ్రీ! నా ఆత్మకు సంతుష్టి కలిగించిన నీకు నా హృదయానంద వందనములు. నీ సన్నిధిలో పూర్ణానందము కలుగునని వ్రాయబడిన వాక్యము నిజమని నాకు తెలిసినది గనుక నీకనేక స్తోత్రములు (కీర్తన. 16:11).

ఓ తండ్రీ! అనుదినము నీ సన్నిధిలో కనిపెట్టగల సమయము సంకల్పింతువని నమ్ముచున్నాను. పూర్వీకులైన భక్తులతో

స్వయముగా మాట్లాడిన నీవు, ఈ నవీన కాలమునకూడ కనిపెట్టు వారితో మాట్లాడుచున్నందుకు నా హృదయానంద వందనములు సమర్పించు చున్నాను. దయగల తండ్రీ! ఈలోకములో పనులు, పాపములు, కష్టములు విశేషముగా నున్నందున నీ సన్నిధిలోకి వచ్చుటకు సమయమే దొరుకదు. అయితే నేను పరలోకమునకు వచ్చిన తరువాత అంతయు సమయమేనని ఇప్పుడే ఆనందపడుచున్నాను. నీ కోరిక, నీపని, నీ పని పద్ధతి, నీ నడిపింపు ఈ మొదలగునవన్నియు సిద్ధించుటవలన నీకే యుగయుగముల పొడుగున కీర్తి కలుగును గాక! నన్ను, నా ప్రార్థనను, నా ప్రయత్నమును, నా కనిపెట్టుటను ప్రభుయేసుద్వారా అంగీకరించుము ఆమేన్.

పరీక్ష:- ఈ ఏడు మెట్లమీద నడచిన వెనుక, నీ నడక సరిగా ఉన్నదో లేదో పరీక్షించుకొనుము. నీవు జీవాంతము వరకును, ఈ నడకమీద నుండగలవో ఉండలేవో పరీక్షించుకొనుము. దేవుడు విననని ప్రార్థన గలదా? ఒకప్పుడు దేవుడు మనలోని కోరిక నెరవేర్చును. ఒకప్పుడు నెరవేర్చడు. రెండును మన ప్రార్థనకే జవాబులే ఇచ్చెదను జవాబే, ఇవ్వను జవాబే.

రెండు పరీక్షలు:- 1. ఇప్పుడు ప్రార్థన కుదిరినదా? 2. ఇక ముందునకు కూడ ప్రార్థన కుదురునను నమ్మికగలదా?

**ప్రభువు ప్రార్థన:-** ఈ దిగువనున్న ప్రార్థన యేసుప్రభువు నేర్పిన ప్రార్థన. దీనిలో మన మనవులన్నియు ఇమిడియున్నందున ఇది అన్ని ప్రార్థనలకు మించినది. స్వంత ప్రార్థన అయిన వెంటనే ప్రార్థన పూర్తియగు నిమిత్తమై ఇది వాడుదురు కాని అనేకులు అనాలోచనగా వాడుట చాలా దుఃఖకరమైన సంగతి. ఆలోచించుచునెమ్మదిగా చేయగలుగు వీలున్నప్పుడు మాత్రమే ఇది

వాడుట మంచిది. ఇది సర్వజన సమ్మతమైన ప్రార్థనయగుటచే, 1893లో చికాగో పట్టణమున జరిగిన సర్వమత సమ్మేళనములో జనసంఘస్థులందరు కలసిచేసిరి. "పరలోకమందున్న మా తండ్రీ! నీ నామము పరిశుద్ధ వరుపబడును గాక. నీ రాజ్యము వచ్చునుగాక. నీ చిత్తము పరలోకమందు జరుగునట్లు భూమిమీద జరుగుగాక. మా అనుదినాహారము నేడు మాకు దయచేయుము. మా యెడల అపరాధము చేసిన వారిని మేము క్షమించునట్లు మా అపరాధము క్షమించుము. మమ్ము శోధనలోకి తేకుము. కీడునుండి తప్పింపుము. రాజ్యము, శక్తి, మహిమ నిరంతరము నీవియైయున్నవి ఆమేన్." (లూకా. 11:2-3; మత్త. 7:10-13).

**యేసునామము:-** ప్రతి ప్రార్థనకు ముగింపులో యేస నామము చేర్చినయెడల ప్రార్థన నెరవేర్పు లభించును.

ఉదా: ఓ దేవా! ఈ మా ప్రార్థనలు నీ ప్రియకుమారుడును మా ప్రభువైన యేసుక్రీస్తునుబట్టి ఆలకించుమని, నిన్ను మిక్కిలి వినయముతో వేడుకొనుచున్నాము. ఆమేన్. వ్రాత ప్రార్థనలో ఇది లేకపోయినను, వాగ్రూపమున (వాక్కురూపములో) వాడవచ్చును.

దీవెన: ఆరాధనాంతమందు బోధకుడిట్లు దీవింపవలెను. 'మన ప్రభువైన యేసుక్రీస్తు కృపయు, దేవుని ప్రేమయు, పరిశుద్ధాత్మ సహవాసమును మీకందరికి నిత్యము తోడైయుండునుగాక." (2కొరింథి. 13:14).

**పాతనిబంధనలో దీవెన స్థాపన చరిత్ర:-** యెహోవా మోషేకు ఈలాగు సెలవిచ్చెను. నీవు అహరోనుతోను అతని కుమారులతోను ఈలాగనుము. మీరు ఇశ్రాయేలీయులను ఈలాగు దీవింపవలెను.

యెహోవా నిన్ను ఆశీర్వదించి నిన్ను కాపాడునుగాక. యెహోవా నీకు తన సన్నిదిని ప్రకాశింపజేసి నిన్ను కరుణించునుగాక, యెహోవా నీమీద తన సన్నిధి కాంతి ఉదయింపచేసి నీకు సమాధానము కలుగజేయును గాక! అట్లువారు ఇశ్రాయేలీయులమీద నా నామమును ఉచ్చరించుట వలన నేను వారిని ఆశీర్వదించెదను. సంఖ్యా. 6:22-26.

**త్రైక దేవుని స్తుతి:**

తండ్రికిని, కుమారునికిని, పరిశుద్ధాత్మకును, ఇప్పుడు ఎల్లప్పుడు యుగయుగములు మహిమ కలుగునుగాక. ఆమేన్.

ఆమేన్ = తథాస్తు.

ప్రతి ప్రార్థన అంతమందు ఇది వాడుదురు. నా ప్రార్థన నెరవేరును అను భావమిందులో (ఆమెన్ అనుమాటలో) గలదు.

**దేవదూతలు చేసిన స్తుతులు:-**

1. సైన్యములకధిపతియగు యెహోవా పరిశుద్ధుడు, పరిశుద్ధుడు, పరిశుద్ధుడు; సర్వలోకము ఆయన మహిమతో నిండియున్నది. యెషయా 6:3.

ఈ స్తుతి స్వరమునకు గడపకమ్ముల పునాదులు కదిలినవి. ఇట్టి స్తుతి ఎవరు చేయగలరు?

2. సర్వోన్నతమైన స్థలములలో దేవునికి మహిమయు, ఆయన కిష్టులైన మనుష్యులకు భూమిమీద సమాధానమును కలుగునుగాక. (లూకా. 2:14).

3. భూతవర్తమాన భవిష్యత్కాలములలో ఉండు సర్వాధికారియు, దేవుడునగు ప్రభువు పరిశుద్ధుడు, పరిశుద్ధుడు, పరిశుద్ధుడు. (ప్రకటన 4:8).

| ప్రార్థన చేసినవారు | వచన స్థానములు | ప్రార్థనాంశములు |
|---|---|---|
| 1. అబ్రాహాము | ఆది. 15:2 | ఒక కుమారుని దయచేయుము |
| 2. అబ్రాహాము | ఆది. 17:18 | ఇష్మాయేలును అంగీకరింపుము |
| 3. అబ్రాహాము | ఆది. 18:23 | సొదొమాకు కృప చూపించుము |
| 4. అబ్రాహాము సేవకుడు | ఆది. 24:12 | పనిని, ప్రయాణమును సఫలముచేయుము |
| 5. యాకోబు | ఆది. 32:11 | ఏశావు చేతినుండి తప్పింపుము |
| 6. మోషే | నిర్గమ. 32:12 | నీ ప్రజలను క్షమించుము |
| 7. మోషే | నిర్గమ. 33:13 | నీ మార్గమును నాకు తెల్పుము |
| 8. మోషే | సంఖ్యా. 10:35,36 | దేవా! మరల రమ్ము! |
| 9. మోషే | సంఖ్యా. 11:11-17 | ఇశ్రాయేలీయులను నడిపించు శక్తి దయచేయుము |
| 10. మోషే | సంఖ్యా. 12:13 | దేవా! మిర్యామును స్వస్థపరచుము |
| 11. మోషే | సంఖ్యా. 14:13-19 | ప్రజల దోషము క్షమించుము |
| 12. మోషే | సంఖ్యా. 27:15 | నీవు ప్రజలకు ఒక నాయకుని యేర్పరచుము |
| 13. మోషే | ద్వితీ. 3:25 | కనానును నాకు చూపించుము |
| 14. మోషే | ద్వితీ. 9:26 | నీ ప్రజలను క్షమించుము |
| 15. ఇశ్రాయేలీయులు | ద్వితీ. 21:6-8 | నరహంతకునికి ప్రాయశ్చిత్తము కలుగనిమ్ము |
| 16. ఇశ్రాయేలీయులు | ద్వితీ. 26:5-10 | ప్రథమ ఫలములు తెచ్చినాము |

| | | |
|---|---|---|
| 17. ఇశ్రాయేలీయులు | ద్వితీ. 26:13-15 | దేశమును ఆశీర్వదింపుము |
| 18. యెహోషువ | యెహోషువ 7:7-9 | కనికరించి జయము కలిగింపుము |
| 19. మానోహ | న్యాయా. 13:8-9 | బిడ్డకు చేయునది మాకు నేర్పింపుము |
| 20. సమ్సోను | న్యాయా. 16:28 | ఫిలిష్తీయులమీద పగదీర్చుకొననిమ్ము |
| 21. హన్నా | 1సమూ. 1:11 | ఒక కుమారుని దయచేయుము |
| 22. దావీదు | 2సమూ. 7:18 | నా కుటుంబమును స్థిరపర్చుము |
| 23. దావీదు | 2సమూ. 24:17 | శిక్షను ఆపుము |
| 24. సొలొమోను | 1రాజులు 3:5-9 | నీ ప్రజలకు న్యాయము తీర్చు జ్ఞానమిమ్ము |
| 25. సొలొమోను | 1రాజులు 8:23 | నీ గుడిలోని ప్రార్థనలన్నియు ఆలకించుము |
| 26. ఏలీయా | 1రాజులు 17:20 | విధవరాలి కుమారుని బ్రతికించుము |
| 27. ఏలీయా | 1రాజులు 18:39 | నా పని నీదేయని కనబర్చుము |
| 28. ఏలీయా | 1రాజులు 19:4 | నా ప్రాణము తీసికొనుము |
| 29. ఎలీషా | 2రాజులు 6:17 | నా సేవకుని కండ్లు తెరువుము |
| 30. ఎలీషా | 2రాజులు 6:18 | ఈ జనులకు అంధత్వముతో మొత్తుము |
| 31. హిజ్కియా | 2రాజులు 19:15-19 | అష్షూరురాజు చేతిలోనుంచి మమ్ము రక్షించుము |
| 32. హిజ్కియా | 2రాజులు 20:3 | మరణమును తప్పించుము |
| 33. యబ్బేజు | 1దిన. 4:10 | నా సరిహద్దును విశాలపరచుము |

| | | |
|---|---|---|
| 34. దావీదు | 1దిన. 29:10-19 | కృతజ్ఞతాస్తుతి అంగీకరించుము |
| 35. సొలోమోను | 2దిన. 6:14 | నీ గుడిలోని ప్రార్థనలన్నియు ఆలకించుము |
| 36. ఆసా | 2దిన. 14:11 | యుద్ధములో జయమిమ్ము |
| 37. యెహోషాపాతు | 2దిన. 20:6 | మోయాబీయుల నుండి తప్పించుము |
| 38. హిజ్కియా | 2దిన. 30:19 | ప్రతివాని నిమిత్తము ప్రాయశ్చిత్తము చేయుము |
| 39. ఎజ్రా | ఎజ్రా 9:6-15 | మేము నీ సన్నిధిని అపరాధులము క్షమించుము |
| 40. నెహెమ్యా | నెహెమ్యా 1:9 | చెరలోనున్న వారిని రప్పించుము |
| 41. నెహెమ్యా | నెహెమ్యా 4:4 | టోబియ, సన్బల్లటుల ఆటంకము సాగనీయకుము |
| 42. లేవీయులు | నెహెమ్యా 9:27 (1-37) | శత్రువుల బాధ తప్పించుము |
| 43. దావీదు | కీర్తన 51:2 | నా పాపము క్షమింపుము |
| 44. ఆగూరు | సామె. 30:7-8 | కావలసినంత దయచేయుము |
| 45. హిజ్కియా | యెష. 37:16 | అష్షూరురాజు చేతిలోనుండి మమ్మును రక్షించుము |
| 46. హిజ్కియా | యెష. 38:3 | మరణమును తప్పించుము |
| 47. యిర్మీయా | యిర్మి. 14:7 | కరువులో మాకు సహాయము చేయుము |
| 48. యిర్మీయా | యిర్మి. 15:15-18 | శ్రమలో నన్ను జ్ఞాపకము చేసికొనుము |
| 49. యెహెజ్కేలు | యెహెజ్కేలు 9:8 | ఇశ్రాయేలీయులను నశింపజేయుదువా? |
| 50. దానియేలు | దానియేలు 9:16 | యెరుషలేముమీది కీడు తొలగించుము |

| | | |
|---|---|---|
| 51. యోనా | యోనా 2:2 | మత్స్యగర్భమునుండి విమోచింపుము |
| 52. హబక్కూకు | హబక్కూకు 3:2 | నీ కార్యము వర్ధిల్లచేయుము |
| 53. కుష్ఠరోగి | మత్తయి 8:2 | నన్ను శుద్ధినిగాజేయుము |
| 54. శతాధిపతి | మత్తయి. 8:6 | నా దాసుని స్వస్థపరుచుము |
| 55. ప్రభువు శిష్యులు | మత్తయి. 8:25 | తుఫానును అణచుము |
| 56. యాయీరు | మత్తయి. 9:18 | నా కుమార్తెను బ్రతికించుము |
| 57. ఇద్దరు గ్రుడ్డివారు | మత్తయి. 9:27 | మాకు చూపు దయచేయుము |
| 58. యేసు ప్రభువు | మత్తయి. 11:25-26 | తండ్రీ నీకు స్తోత్రము |
| 59. కనాను స్త్రీ | మత్తయి. 15:22 | నా కుమార్తెలోని దయ్యము వెళ్ళగొట్టుము |
| 60. చాంద్రరోగి | మత్తయి. 17:15 | నా కుమారుని స్వస్థపరచుము |
| 61. యేసు ప్రభువు | మత్తయి. 26:39 | తండ్రీ! నీ చిత్తమైతే ఈ గిన్నె తొలగించుము |
| 62. యేసు ప్రభువు | మత్తయి. 27:46 | తండ్రీ! నీవు నా చెయ్యి ఎందుకు విడిచితివి |
| 63. బర్తిమయి | మార్కు. 10:47 | నాకు దృష్టి కలుగజేయుము |
| 64. తప్పిపోయిన కుమారుడు | లూకా. 15:21 | నీ కుమారుడనని అనిపించుకొన యోగ్యుడనుకాను |
| 65. అపోస్తలులు | లూకా. 17:5 | మా విశ్వాసము వృద్ధి పొందించుము |
| 66. సుంకరి | లూకా. 18:13 | దేవా! పాపిని, కరుణించుము |
| 67. 10 మంది కుష్ఠరోగులు | లూకా 17:13 | మా కుష్ఠు పరిహరించుము |

| | | |
|---|---|---|
| 68. యేసు ప్రభువు | లూకా 23:34 | వీరిని క్షమించుము |
| 69. దొంగ | లూకా 23:42 | యేసూ! నన్ను జ్ఞాపకము చేసికొనుము |
| 70. యేసు ప్రభువు | లూకా 23:46 | తండ్రీ! నీ చేతికి నా ఆత్మను అప్పగించుచున్నాను |
| 71. సమరయ స్త్రీ | యోహాను. 4:15 | జీవ జలమిమ్ము |
| 72. ఒక ప్రధాని | యోహాను. 4:49 | నా కుమారుని బ్రతికింపుము |
| 73. యేసు ప్రభువు | యోహా. 11:41-42 | తండ్రీ! నీవు నా మని విన్నందుకు నీకు కృతజ్ఞతా స్తుతి |
| 74. యేసు ప్రభువు | యోహా. 12:27-28 | తండ్రీ! ఈ గడియ తప్పించుము |
| 75. యేసు ప్రభువు | యోహా. 17:11 | తండ్రీ! అపోస్తలుల నైక్యపరచుము |
| 76. స్తెఫను | కార్య. 7:60 | వారిమీద ఈ పాపము మోపకుము |
| 77. పౌలు | కార్య. 9:1-6-11 | ప్రభువా! నేనేమి చేయవలెనో తెల్పుము |
| 78. పౌలు | 2కొరింథి. 12:8 | శరీరములో ముల్లు తొలగించుము |
| 79. పౌలు | ఎఫె. 1:17-20; 3:14-21 ఫిలి. 1:9-11; కొల. 1:6,9 1థెస్స. 3:10-13; 2థెస్స. 1:11,12; 2:16,17; 3-5 హెబ్రీ. 13:20-12. | సంఘములకు ప్రత్యక్షత ఇమ్ము |
| 80. సంఘవధువు | ప్రక. 22:20 | ప్రభువైన యేసూరమ్ము |

# ప్రార్థన వాక్యములు

మీ తెలివియు, మీశక్తియు, మీ ఓపికయును, వీటిని చదువగలదా?

ఆది. 32:9; నిర్గ. 32:11; నిర్గ. 33:12; సంఖ్యా. 6:22; సంఖ్యా. 10:35–36; సంఖ్యా. 12:13–14; సంఖ్యా. 14:13; సంఖ్యా. 27:15; ద్వితీ. 3:24; ద్వితీ. 5:10; ద్వితీ. 9:26; యెహో7:7; న్యాయా. 13:8–9; న్యాయా. 16:28; 1సమూ. 1:11; 1సమూ. 24:17; 2సమూ. 7:18; 1రాజు. 3:5–9; 1రాజు. 17:20; 1రాజు. 18:36; 1రాజు. 19:4; 2రాజు. 6:17–18; 2రాజు. 20:3; 1దిన. 4:10; 1దిన. 21:8; 2దిన. 6:14; 2దిన. 14:11; 2దిన. 20:6; 2దిన. 20:10–19; నెహె. 1:5; నెహె. 9:5; కీర్త. 51:2; సామె. 30:8–9; యెష 38:3; యిర్మి. 14:17; దాని. 2:20; యోనా. 2:2; హబక్కూకు 3:1–16; మత్త. 8:2; 6:25; మత్త. 8:9 మత్త. 9:27; మత్త. 11:25; మత్త. 15:22; మత్త. 17:15; మత్త. 26:39; మత్త. 27:46; మార్కు. 6:49; మార్కు. 10:47; లూకా. 10:21; లూకా. 11:2; లూకా. 15:18–19; లూకా. 17:18; లూకా. 18:11–13; లూకా. 22:42; లూకా. 23:34–42; యోహా. 4:11; యోహా. 4:49; యోహా. 11:41–41; యోహా 17:5; అపో.కార్య 1:24–25; అపో.కార్య. 7:59–60; అపో.కార్య. 4:34; 25–30; అపో.కార్య. 9:5–6; అపో.కార్య 17:2; అపో.కార్య. 17:17–18; అపో.కార్య. 18:22; అపో.కార్య 24:12; 2కొరింథి. 12:10; ఎఫెసి. 1:17–20; ఎఫెసి. 3:14–21; ఫిలిప్పీ. 1:9–11; కొలస్సీ. 1:2–11; 1థెస్స. 3:10–11; 2థెస్స. 1:11–12; హెబ్రీ. 13:20–21; ప్రక. 22:20.

# ప్రార్థన మెట్లు

గ్రంథకర్త

## యం. దేవదాసు అయ్యగారు

గుంటూరు - 2025 :: చందా : 10:00

Bible Mission HQ Guntur

| | | | | |
|---|---|---|---|---|
| మొదటి | ముద్రణ | 1970 | ప్రతులు | 1000 |
| రెండవ | ముద్రణ | 1972 | ప్రతులు | 1000 |
| మూడవ | ముద్రణ | 1978 | ప్రతులు | 1000 |
| నాల్గవ | ముద్రణ | 1982 | ప్రతులు | 1000 |
| ఐదవ | ముద్రణ | 1984 | ప్రతులు | 1000 |
| ఆరవ | ముద్రణ | 1986 | ప్రతులు | 1000 |
| ఏడవ | ముద్రణ | 1992 | ప్రతులు | 5000 |
| ఎనిమిదవ | ముద్రణ | 1997 | ప్రతులు | 10,000 |
| తొమ్మిదవ | ముద్రణ | 2004 | ప్రతులు | 5000 |
| పదవ | ముద్రణ | 2007 | ప్రతులు | 5000 |
| పదకొండవ | ముద్రణ | 2009 | ప్రతులు | 3000 |
| పన్నెండవ | ముద్రణ | 2010 | ప్రతులు | 5000 |
| పదమూడవ | ముద్రణ | 2012 | ప్రతులు | 5000 |
| పదునాల్గవ | ముద్రణ | 2013 | ప్రతులు | 5000 |
| పదిహేనవ | ముద్రణ | 2015 | ప్రతులు | 10,000 |
| పదహారవ | ముద్రణ | 2017 | ప్రతులు | 5000 |
| పదిహేడవ | ముద్రణ | 2019 | ప్రతులు | 3000 |
| పద్దెనిమిదవ | ముద్రణ | 2020 | ప్రతులు | 3000 |
| పంతొమ్మిదవ | ముద్రణ | 2022 | ప్రతులు | 3000 |
| ఇరువదవ | ముద్రణ | 2023 | ప్రతులు | 3000 |
| ఇరువది ఒకటవ | ముద్రణ | 2024 | ప్రతులు | 2000 |
| ఇరువది రెండవ | ముద్రణ | 2025 | ప్రతులు | 2000 |

**ఇది దేవుడు, యం. దేవదాసు అయ్యగారికి బైలుపరిచిన**

# బైబిలు మిషను ప్రచురణ

**ముద్రణ:బైబిలుమిషను ప్రెస్, పెదకాకాని, గుంటూరు – 522509.**

**ఫోన్: 9949121777.**